క్లుప్తంగా

సీఐ గంగాధర్‌కు సన్మానం



సీఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: సీఐ సీహెచ్.గంగాధర్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ముద్విన్ గ్రామ అధ్యక్షుడు నక్కపోతు మధు, నాయకులు నర్సింహ, వి.నర్సింహ, కావటి శ్రీశైలం, ఏదుల నర్సింహ, రేవంత్ మిత్రమండలి మండల అధ్యక్షుడు గంట నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

యాచారం: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలి వెళ్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 27న వరంగల్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం యాచారం మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని, మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజాబలం నిరూపించుకునేందుకు సభకు తరలిపోదామని పిలుపునిచ్చారు. ఒక్కో గ్రామం నుంచి 200 మంది కార్యకర్తలకు తగ్గకుండా పోదామని, అందుకు కావాల్సిన బస్సులు, వాహనాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాచ్యబాష, నాయకులు యాదయ్యగౌడ్, శంకర్‌నాయక్, నర్సింహారెడ్డి, యాదయ్య, ఎండీ హబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే..



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఎంఈఓ రాందాస్ తదితరులు

మంచాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాందాస్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రుబియాన, ఝాన్సీ, నారాయణరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ కన్నయ్య, సీఆర్‌పీలు జగదీష్, గిరీష్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

విద్యతోనే ఉన్నత స్థాయి



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తదితరులు

షాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు గురుకుల విద్యాసంస్థలకు ఎంపిక కావడంతో సన్మాన కార్యక్రమాన్ని హెచ్‌ఎం సింహాద్రినాయుడుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ పాండు, కాంప్లెక్స్ జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సరిత, నాయకులు నర్సింహులు, కుమార్, హరీష్, శ్రీకాంత్, రవి, మహేందర్, ఉపాధ్యాయులు హేమసుందర్ రావు, సరిత, అంగన్‌వాడీ వినోద, తదితరులున్నారు.

నిధులు లేక.. పనులు సాగక

అసంపూర్తిగా ఎంపీడీఓ భవన నిర్మాణం

- రూ.50 లక్షలతో.. గ్రౌండ్ లెవల్ పూర్తి
- తొమ్మిదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం
- అరకొర వసతులలో ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజలు



అసంపూర్తిగా ఎంపీడీఓ భవన నిర్మాణ పనులు

కడ్తాల్: ప్రజల ఆకాంక్ష మేరకు 2016లో కడ్తాల్‌ను మండలముగా ఏర్పాటు చేసినా.. అందుకు తగిన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమయింది. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం పూర్తిగాక అధికారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 2023 సెప్టెంబర్‌లో ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆపై నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల లేమితో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ వరకే పనులు పూర్తయ్యాయి. ఏడాదిన్నర కాలంగా పనులు నిలిచిపోయాయి.

రేకుల షెడ్డులో సమీక్షలు

ప్రస్తుతం కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం మండల ఏర్పాటు నుంచి (తొమ్మిదేళ్లు) అద్దె భవనంలో కొనసాగుతోంది. అరకొర వసతులతో కేవలం ఐదారు గదులు ఉన్న భవనంలోనే, ఈజీఎస్ కార్యాలయ పనులతో పాటు, మండల పరిషత్ కార్యకలాపాలను కొనసాగిస్తూ అధికారులు ఇబ్బంది పడుతున్నారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం వచ్చే ప్రజా ప్రతినిధులు, సామాన్య ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా మండల సర్వసభ్య సమావేశం, వివిధ సమీక్షలు నిర్వహించేందుకు సరైన వేదిక లేకపోవడంతో, రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు.

రూ.50 లక్షలతో..

మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ సొంత భవన ఆవశ్యకతను గుర్తించిన ప్రజా ప్రతినిధులు, సమస్యను నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కృషితో ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి అప్పట్లో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2023 సెప్టెంబర్‌లో భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఉన్న నిధులతో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ వరకే పనులు పూర్తయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యపై దృష్టి సారించి, ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి.. వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణ పనులు నిధుల లేమితో ఆగిపోయాయి. నిర్మాణానికి కావాల్సిన అదనపు నిధుల గురించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే, పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– దార్ల పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

నీటి వృథా.. ఇలా అయితే ఎలా?



వృథాగా పోతున్న కృష్ణా జలాలు

కృష్ణా జలాల పైప్‌లైన్ ధ్వంసం

తుర్కయంజాల్: అసలే వేసవి కాలం. మండుతున్న ఎండలతో భూగర్భ జలాలు అడుగంటుతుండగా.. బోరుబావులు మొరాయిస్తున్నాయి. దీంతో నీరు సక్రమంగా రాక మున్సిపాలిటీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కృష్ణానీరు సరఫరా అవుతున్నప్పటికీ.. అది అంతంత మాత్రమే. ఇంత వరకు బాగానే ఉన్నా.. అరకొర నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురై భారీగా నీరు వృథాగా పోతోంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో పరిస్థితి తీవ్రం అవుతోంది. గురువారం తుర్కయంజాల్‌లోని సర్వే నంబర్ 399లో కృష్ణా జలాల పైప్‌లైన్ పగిలి, సుమారు గంట పాటు నీరు వరదలా రోడ్డుపై పారింది. ఆ తరువాత సంబంధిత సిబ్బంది పరిస్థితిని సమీక్షించి, మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో పైప్‌లైన్ ధ్వంసమైందని వాటర్‌మెన్ గుర్తించారు. విషయాన్ని కాంట్రాక్టర్‌కు చెప్పారు. అయినప్పటికీ అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా వేలాది లీటర్ల నీరు వృథాగా పోయింది. ఇదే విషయమై జలమండలి మేనేజర్ వినయ్‌ను వివరణ కోరగా.. వెంటనే మరమ్మతు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

రేపు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

మంచాల: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం మంచాల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆగాపల్లిలో రూ.4 కోట్లతో ఆగాపల్లి– నోముల బీటీ రోడ్డు, ఆగాపల్లిలో రూ.11లక్షలతో మైనార్టీ కమ్యూనిటీ హాల్, మరో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించనున్నారని తెలిపారు. కాగజ్‌ఘట్‌లో రూ.6 లక్షలతో శ్మశాన వాటికకు ప్రహరీ, మరో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, జాపాలలో రూ.20 లక్షలతో అండర్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణం, అస్మత్‌పూర్‌లో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణం పనులు, రూ.5 లక్షలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మూనావత్ రాజునాయక్ ఏర్పాటు చేసిన ఆటోఫైనాన్స్ కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లక్పతినాయక్, బీక్యానాయక్, రామునాయక్, యాదగిరిరెడ్డి, రాజునాయక్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు భూభారతిపై అవగాహన సదస్సు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న భూభారతి పోర్టల్‌పై ఈ నెల 19న ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

'రాజీవ్' రుణాలు ఎప్పుడు?

- మండలంలో 2,139 అర్జీలు!



దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీడీఓ(ఫైల్)

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండల పరిధిలో సుమారు 2139 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1383 మంది మండల కార్యాలయంలో దరఖాస్తు సంబంధిత జిరాక్స్ పత్రాలను అందజేశారు. ఈ పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 118 రకాల యూనిట్లు, ఎస్టీ కార్పొరేషన్ 83 రకాలు, బీసీ కార్పొరేషన్ కింద 194 రకాలు, ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా 196, మైనార్టీ కార్పొరేషన్‌కు 159, క్రిస్టియన్ కార్పొరేషన్ కింద మరో 196 రకాల యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో పలువురు మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. అర్హులందరికీ త్వరగా రుణాలు అందజేయాలని కోరారు.

అర్హులందరికీ ఇవ్వాలి



రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది విద్యా వంతులు ఉన్నారు. ఉపాధి లేకుండా ఇబ్బంది పడుతున్నారు. అర్హత గల వారందరికీ రుణాలు ఇవ్వాలి. జీవనోపాధి కల్పించే విధంగా ఉండాలి. అప్పుడే కొంత ప్రయోజనం కలుగుతుంది.

–బొట్టు ప్రవీణ్ కుమార్, లోయపల్లి

నిబంధనల ప్రకారం



రుణాల విషయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు సాగుతాం. వచ్చిన దరఖాస్తులను తీసుకున్నాం. ఇక ప్రభుత్వం స్పష్టమైన గైడ్‌లెన్స్ ఇవ్వాలి. యూనిట్ల ఆధారంగా, అవసరమైతే అర్హులకు శిక్షణ ఇస్తుంది.

– అన్నారం బాల శంకర్, ఎంపీడీఓ, మంచాల

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు

షాద్‌నగర్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు పేర్కొన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండల పరిధిలో దాదాపు 252 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు అవుతుందన్నారు. దీని నిర్వాహణకు డబ్బులు నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేసిన రైతులకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ అందజేస్తారన్నారు. ఎరువులకు ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేళ్లకు రూ.16800లను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందన్నారు. ఎకరాలకు 8 నుంచి 10 టన్నులపైనే గెలల దిగుబడి వస్తుందని, ఒక టన్ను రూ.21వేలు ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కంపెనీవారే పొలం దగ్గరకువచ్చి కొనుగోలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆయిల్ వాల్యూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు, ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

తొలి విడతలో 500 ఇందిరమ్మ ఇళ్లు

- 20 నుంచి లబ్ధిదారుల ఎంపిక
- మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి తొలి విడతలో 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. పుర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇళ్లను కేటాయించారని వెల్లడించారు. ఇళ్ల కోసం 4,563 దరఖాస్తులు వచ్చాయని, ఎల్ 1 కింద 975 మంది, ఎల్ 2 కింద 1300 మంది, ఎల్ 3 కింద 2250 మంది ఉన్నారని తెలిపారు. ఇంటి స్థలం ఉండి, ఇల్లు లేని 500 మంది పేదలను(జాబితా 1) వార్డుల వారీగా గుర్తించి ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి 30వ తేదీలోగా గెజిటెడ్ అధికారుల బృందం .. జాబితా 1లోని దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తుందన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో తుది జాబితా వెలువడనుందని స్పష్టంచేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మాయమాటలతో కాంగ్రెస్ కాలక్షేపం: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

కడ్తాల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, మాయ మాటలతో కాంగ్రెస్ కాలక్షేపం చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్, మాజీ ఎంపీపీ వీరయ్య, బీజేవైఎం అధికార ప్రతినిధి భగీరథ్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్ నాయక్, నాయకులు మాన్యనాయక్, శ్రీశైలంగౌడ్, లక్ష్మణ్ నాయక్, రెడ్యా, రాందాస్ నాయక్, వెంకటేశ్, విక్రమ్‌చారి, మునేశ్, అంజయ్య, రాజు, వెంకటయ్య, శ్రీను, రవి ఉన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మేడిగడ్డతండాలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అనిత

ఆమనగల్లు: పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, అనిత అన్నారు. ఆమనగల్లు మండలం శంకరకొండ తండా, మేడిగడ్డ తండా, పోలెపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం పోషణ పక్షోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోషకాహారం లోపిస్తే అనారోగ్యానికి గురవుతామని చెప్పారు. గర్భిణులు, బాలింతలు నిత్యం పాలు, గుడ్లు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలు, సరోజిని బాయి, నుస్రత్ బేగం, దోళి, జైనాబీ, ఉపాధ్యాయులు స్వప్న, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్: అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని దేవునిపల్లిలో దెబ్బతిన్న పంటలను స్థానిక నేతలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అకాలంగా కురిసిన భారీ వర్షానికి దెబ్బతిందన్నారు. పంటలు, తోటల సాగు కోసం రైతులు, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారన్నారు. పంట చేతికి రాకపోగా అప్పులు మిగిలిపోయాయని అన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి 32 ఎకరాలు మామిడి తోట, పసుల జంగయ్యకు చెందిన 4 ఎకరాల బొప్పాయి తోట పూర్తి దెబ్బతిన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర సర్కారు అమలుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గావ్‌చలో–బస్తీచలో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా అందుతున్న సన్నబియ్యం పంపిణీలో కేంద్రం వాటా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణతో పాటు పలు పథకాలకు కేంద్రం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇలాంటి విషయాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలే ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు నర్సింహాగౌడ్ ఉన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్' ఆదాయం భేష్

- ప్రజల్లో పెరిగిన అవగాహన..
- ఫీజు చెల్లించిన 3,642 మంది దరఖాస్తుదారులు
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.9.43 కోట్ల ఆదాయం
- ఈ నెల 30తో ముగియనున్న రాయితీ గడువు



ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్న దరఖాస్తుదారులు

ఇబ్రహీంపట్నం: అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) గడువు పెంపుతో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి మరింత ఆదాయం సమకూరింది. తొలుత మార్చి 31 వరకు 25 శాతం రాయితీ(రిబేట్)తో దరఖాస్తు దారులు ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం గడువు విధించిన సంగతి తెలిసిందే. అనంతరం మరోసారి ఏప్రిల్ 30 వరకు గడువు పెంచడంతో.. ఫీజు చెల్లించేందుకు భూ యజమానులు ముందుకు వస్తున్నారు. మున్సిపాలిటీలో 14,053 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఉండగా, మార్చి 31 వరకు 1,918 మంది రుసుం చెల్లించారు. తాజాగా గురువారం నాటికి 1,724 మంది ఫీజు చెల్లించారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం 3,642 దరఖాస్తుదారుల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూపేణా రూ.9.43 కోట్లు వచ్చాయి.

మొదట్లో సందిగ్ధం..

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మొదట్లో ప్లాట్ల యజమానులు ముందుకురాలేదు. ఫీజు చెల్లించాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించడం, నేరుగా ఫోన్లు చేయడంతో వారిలో కదలిక వచ్చింది. తొలుత ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియకు సాంకేతిక, అవగాహన లోపాలు కలగడం, స్పష్టత లేకపోవడంతో కొంత అడ్డంకిగా మారింది. అనంతరం ప్రక్రియ ఊపందుకున్నప్పటికీ.. గడువు సమీపిస్తుండటం, వేలాది రూపాయల ఫీజు చెల్లింపునకు ఆర్థికంగా వెసులుబాటు కాకపోవడంతో దరఖాస్తుదారులు సకాలంలో చెల్లించలేకపోయారు. గడువు పొడగించడంతో చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.

వినియోగించుకోండి



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఇప్పటి వరకు రూ.9 కోట్ల 43 లక్షలు ఫీజుల రూపేణా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చింది. ఈ నెలాఖరు వరకు 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం